క్లుప్తంగా

లక్ష్యాన్ని త్వరగా పూర్తిచేయాలి



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న డీఎస్‌డీఓ వెంకటరమణ

పొందూరు: ప్రభుత్వం నిర్దేశించిన ఎస్‌సీఐ లక్ష్యాన్ని త్వరగా పూర్తిచేయాలని మిల్లర్లకు జిల్లా పౌరసరఫరాల అధికారి డి.వెంకటరమణ ఆదేశించారు. మండలంలో పలు రైస్ మిల్లులను శనివారం తనిఖీ చేశారు. జూన్ 30లోగా లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఇప్పటికే ఆదేశించారన్నారు. డీటీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రాధ, వీఆర్వో రేవతిరావు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఎంఈఓలు

సారవకోట: ఆశ్రమ పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగు పర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ విశ్వేశ్వరరావు సూచించారు. ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సూచనల మేరకు మండలంలోని సవరబొంతు ఆశ్రమ పాఠశాలను శనివారం సందర్శించారు. ఇటీవల ప్రభుత్వం అందించిన జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులందరికీ అందాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. కిట్లుకు సంబంధించి విద్యార్థుల బయోమెట్రిక్ తీసుకోవాలన్నారు. సుదూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇక్కడి వసతి గృహాల్లో ఉంటారని, వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఎంఈఓ ఎం.వి.రమణ, రెండో ఎంఈఓ భూలక్ష్మి ఉన్నారు.

31 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న త్రినాథరావు

నరసన్నపేట: వైఎస్సార్ కంటి వెలుగుల పథకం ద్వారా వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నామని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ త్రినాథరావు అన్నారు. మాకివలస పీహెచ్‌సీ పరిధిలోని నరసన్నపేట సబ్‌సెంటర్-1లో 31 మందికి కంటి పరీక్షలను ఆప్తాలమిక్ ఆఫీసర్ బాలగంగాధర రాజు శనివారం చేపట్టారు. దీనిని పరిశీలించిన అనంతరం త్రినాథరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు జరుగుతున్నాయన్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధులందరూ వచ్చి తనిఖీలు చేసుకోవాలన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



వైఎస్సార్ బీమా మొత్తం అందజేస్తున్న నాయకులు

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి గ్రామానికి చెందిన చందనాలు గోవిందరావు ఇటీవల అనారోగ్యంతో చెందారు. మృతుని భార్య ఆదిలక్ష్మికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10వేల నగదును వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేపల్లి హరి, ఇల్లాకులు సూర్యప్రకాశరావు, పెద్ది రాజేష్ శనివారం అందించారు. పంచాయతీ కార్యదర్శి అనిల్, వెల్ఫేర్ అసిస్టెంట్ సాయిరామ్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



పవన్‌సోయిను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: మండలంలోని పెద్దలోగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరం పది ఫలితాల్లో పాఠశాల టాపర్‌గా నిలిచిన పవన్‌సోయికు రామరాజు విద్యాపురస్కారాన్ని హెచ్‌ఎం బి.వి.రాజగోపాలరావు శనివారం అందజేశారు. జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ ఎంపీడీఓ సలాన చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదవాలన్నారు. ఉపాధ్యాయులు బందన శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రభావతి, పి.రామరాజు పాల్గొన్నారు.



కొత్తూరు: పారాపురం గ్రామ సచివాలయం వద్ద ప్రజలతో మాట్లాడుతున్న జేసీ నవీన్‌కుమార్



హిరమండలం: గులుమూరు సచివాలయం వద్ద లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పాతపట్నం: చంగుడిలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ దొర సావిత్రమ్మ, అధికారులు

జగనన్న సురక్షతో.. సత్వర సేవలు

- పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: జమ్ములో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, అధికారులు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆమదాలవలస మండలంలోని తొగరాం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం ఆధ్వర్యంలో స్పీకర్ శనివారం ప్రారంభించారు. సచివాలయ పరిధిలో 11 రకాల సేవలను ఉచితంగా ప్రజలకు అందించే వెసులుబాటును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల చెంతకే పథకాలు అందించడం జరుగుతుందన్నారు. నరసన్నపేట మండలంలోని తామరాపల్లి, జమ్ము సచివాలయాల్లో, పోలాకి మండలం పోలాకి, పల్లిపేట సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష సభల్లో ఎమ్మెల్యే కృష్ణదాస్ పాల్గొన్నారు. ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష సభలు ఏర్పాటు చేసి అర్హులకు 11 రకాల ధ్రువపత్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



బూర్జ: దొంకలపర్తలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేటలో మాట్లాడుతున్న జేసీఎస్ ఇన్‌చార్జి విష్ణుమూర్తి



పొందూరు: బాణాంలో ధ్రువపత్రాలు అందస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, అధికారులు



సరుబుజ్జిలి: కొండవలసలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న జేసీ నవీన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



మెళియాపుట్టి: పట్టుపురం గ్రామ సచివాలయం వద్ద మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి భవానీశంకర్

సికిల్ సెల్ ఎనీమియా సర్టిఫికెట్ల జారీ



కొత్తూరు: ధ్రువపత్రాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ, వైద్యాధికారి



మెళియాపుట్టి: మాట్లాడుతున్న డాక్టర్ గ్రీష్మ

మెళియాపుట్టి: సికిల్ సెల్ ఎనీమియా (రక్తహీనత వ్యాధి)తో బాధపడుతున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 వేలు పింఛన్ అందిస్తున్నాయని మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గ్రీష్మ అన్నారు. మండలంలోని ఇల్లాయిపురం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కేరాసింగి గ్రామ పంచాయతీకి చెందిన కంది లతీష్, చింతాడ దీక్షితకు వ్యాధి నిర్ధారణ చేసి శనివారం సర్టిఫికెట్లను అందజేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉన్న వారికి ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నామని, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది..

ప్రతీ నెల పదో తేదీ నాటికి వారి ఖాతాల్లో రూ.10వేలు జమ అవుతాయన్నారు. సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సంతోష్, ఏఎన్‌ఎంలు నీలవేణి, సంతోషి, సూపర్‌వైజర్లు నాగభూషణరావు, హేమలత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొత్తూరు: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్నవారికి వైద్య ఖర్చుల నిమిత్తం నెలకు రూ.10 వేల పింఛన్ అందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటున్నాయని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవర ప్రసాదరావు అన్నారు. మండలంలోని కురిగాం పీహెచ్‌సీలో శనివారం జాతీయ సికిల్ సెల్ ఎనిమీయా వ్యాధి నివారణ కార్యక్రమాన్ని వైద్యాధికారి శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించారు. సికిల్ సెల్ ఎనీమియాతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ శ్రీలత అన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, వైద్యులు సూచించిన మందులు వాడితే ఈ వ్యాధి దశల వారిగా తగ్గిపోతుందన్నారు. మండలంలో ఈ వ్యాధితో 20 మంది బాధపడుతున్నట్లు చెప్పారు. బాధితలకు వ్యాధి నిర్ధారణ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్స్ డేను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొయిలాపు సంజీవరావు, ఈఓ బుజ్జిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన



సారవకోట: విత్తన శుద్ధి చేపడుతున్న రైతులు



పాతపట్నం: విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

సారవకోట: బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.సి.హెచ్.వెంకటరావు రైతులకు సూచించారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో విత్తన శుద్ధిపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలన్నారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల నేల, విత్తనం నుంచి సంక్రమించే వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చునన్నారు. విత్తన శుద్ధి వల్ల 95 శాతం విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంటుందన్నారు. వీఏఏ ప్రవీణ్, ఎన్ఎఫ్ఏ గోవిందరెడ్డి, మాస్టర్ ట్రైనీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక మొలక శాతం

పాతపట్నం: వరి విత్తనాలను శుద్ధి చేయడం వల్ల మొలక శాతాన్ని పెంచవచ్చని ప్రకృతి వ్యవసాయం నార్త్ కోస్టల్ రీజనల్ శిక్షణ అధికారులు ప్రకాశరావు, హేమసుందరావు అన్నారు. మండలంలోని కాపు గోపాలపురంలో సామూహిక బీజామృతం తయారుచేసే విధానం, వరి విత్తనాల నాటడంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. విత్తశుద్ధి చేయడం వల్ల మొక్క ఏపుగా పెరిగి, చీడపీడలను తట్టుకుంటుందన్నారు. టంకాల ఢిల్లేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రోగులకు బాధ్యతగా సేవలు అందించండి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

నరసన్నపేట: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు బాధ్యతగా సేవలు అందించాలని, వెల్‌నెస్ కేంద్రాల్లో విధిగా సిబ్బంది అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ బి.మీనాక్షి అన్నారు. శనివారం ఆమె నరసన్నపేట టౌన్‌లోని పెద్దపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని, సబ్ సెంటర్‌ను శనివారం పరిశీలించారు. ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో అశ్రద్ధ వద్దని సూచించారు. సమయం ప్రకారం ఇమ్యూనైజేషన్ టీకాలు పిల్లలకు అందివ్వాలన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వర్షాలు పడుతుండటంతో జ్వరాల తీవ్రత పెరుగుతుందని, సిబ్బంది తరచూ తనిఖీలు చేపట్టి రోగులకు అండగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాకివలస పీహెచ్‌సీ వైద్యుడు దుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు రేపు

హిరమండలం: మండల కేంద్రంలోని పెద్దకోరాడలో గల షిర్డీ సాయిబాబా, న్యూ బ్యారేజీ సెంటర్‌లో గల షిర్డీ సాయినాథ్ ఆలయాల్లో ఈ నెల 3వ తేదీన గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం బాబాకు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాయంత్ర లక్ష పువ్వులతో పుష్పార్చన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రెండు ఆలయాల వద్ద అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద ఎత్తు హాజరుకావాలని కోరారు.

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో గల అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, ఉదయాన్నే పాలాభిషేకం, విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజలు అనంతరం ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ, పరిసర ప్రాంతాకు చెందిన భక్తులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: 'జగనే మళ్లీ రావాలి' అనే కార్యక్రమం ద్వారా సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆధారాలతో ప్రజల్లోకి తీసుకునివెళ్తామని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలో గల స్థానిక జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు ఈ ప్రభుత్వంపై చేస్తున్న విష ప్రచారాలను తిప్పికొడతామన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలిక వసతులు, మహిళా సాధికారత తదితర రంగాల్లో ఈ నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామన్నారు. రాష్ట్రంలో గల 5 కోట్ల 30 లక్షల ప్రజానీకంలో సుమారు 41 శాతం ప్రజలు వ్యవసాయ రంగం ద్వారా ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ రంగాన్ని 2014–17 మధ్య కాలంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హయంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. రైతు రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి 29 లక్షల మంది రైతులకు మోసం చేశారన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాల పంట..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతు భరోసా పథకం ద్వారా 58 లక్షల 30 వేల మంది రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.27 వేల కోట్లు అందించామన్నారు. 45 లక్షల మంది రైతులకు ఉచిత పంట బీమా సదుపాయం కల్పించామని, 74 లక్షల మంది రైతులకు రూ.9 వేల కోట్లు వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించామన్నారు. రైతులందరికీ ఉచితంగా పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా అందించామని వివరించారు. రైతులకు అందించిన ఈ సాయం వల్ల వ్యవసాయ రంగంలో 8.5 శాతం వృద్ధి రేటును సాధించి, మన రాష్ట్రాన్ని దేశంలో 6వ స్థానానికి తీసుకువచ్చని వచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశ సుపరిపాలన సూచిక (డీఏఆర్‌పీజీ)లో మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చామన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే



నరసన్నపేట: కేక్ కట్ చేస్తున్న వైద్యులు



పొందూరు: కింతలి పీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ మల్లేశ్వరమ్మ

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం డాక్టర్స్ డే కార్యక్రమం సందడిగా జరిగింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ జయశ్రీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ వృత్తి ఎంతో పవిత్రమైనదని, దీనిని అంకిత భావంతో నిర్వహించాలన్నారు. డాక్టర్ వృత్తికి వన్నె తీసుకురావాలని తోటి వైద్యులకు సూచించారు. వైద్యులు సుధారాణి, గొద్దు క్రాంతి, చంద్రమౌళి, ప్రతిభాచైతన్య తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: పొందూరు సీహెచ్‌సీలో, కింతలి, తాడివలస పీహెచ్‌సీల్లో ఘనంగా డాక్టర్స్ డేను నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పొందూరు సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి రామదాసు, పీహెచ్‌సీల డాక్టర్లు మల్లేశ్వరమ్మ, సాగరిక సిబ్బంది పాల్గొన్నారు.

81 మద్యం సీసాల స్వాధీనం

నరసన్నపేట/పాతపట్నం: నరసన్నపేట, పాతపట్నం మండలాల్లో చేపట్టిన దాడుల్లో 81 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు నరసన్నపేటలో శనివారం నిర్వహించిన తనిఖీల్లో ముగ్గురు వ్యక్తుల నుంచి 51 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని సీఐ ఏఎస్ దొర తెలిపారు. పెద్దపేట వద్ద బరాటం శ్రీధర్ నుంచి 10 బాటిళ్లు, రెల్లివీధిలోని కాకర్ల ముఖలింగం నుంచి 29 బాటిళ్లు, లక్ష్మన్నపేట కూడలిలో బోయిన మంగావతి నుంచి 12 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

30 మద్యం బ్యాటిళ్ల పట్టివేత..

పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద పోలీసులు శనివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఒడిశా నుంచి కారులో 30 మద్యం బ్యాటిళ్లతో ఇద్దరు వ్యక్తులు వస్తుండగా.. పోలీసులు వారి కారును ఆపారు. ఇద్దరు వ్యక్తులు కారు దిగి పారిపోయారన్నారు. కారు, మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు తెలిపారు.

పాము హల్‌చల్



పామును చూపిస్తున్న రామారావు

కొత్తూరు: మండలంలోని నివగాం ఎస్‌బీఐలో శనివారం పాము హల్‌చల్ చేసింది. బ్యాంకులోకి పాము వెళ్లటాన్ని సెక్యూరిటీగార్డు గమనించాడు. వెంటనే సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. సిబ్బంది, ఖాతాదారులు బయటకువచ్చేశారు. ఆకులతంపరకు చెందిన పాములు పట్టే నిపుణుడు డి.రామారావుకు సమాచారం ఇచ్చారు. బ్యాంకులో తిష్టవేసిన పామును చాకచక్యంగా పట్టుకుని సమీపంలోని కొండల్లో విడిచిపెట్టారు.